క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అశ్రద్ధ వద్దు

కర్లపాలెం: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. మండల పరిధిలోని చింతాయపాలెం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. వెల్‌నెస్ సెంటర్‌లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున గ్రామంలో సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది సర్వే నిర్వహించాలని చెప్పారు. మందులు కూడా సిద్ధంగా ఉంచుకోవాలని, సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. అనంతరం స్థానిక గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

వేమూరు: మండలంలోని చదలవాడలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్ర 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ గోపి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులంతా సహకరించాలని ఆయన కోరారు.

హైస్కూలులో సైన్స్ ల్యాబ్ ఆధునికీకరణ



వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆధునికీకరించిన సైన్స్ ల్యాబ్‌ను ప్రధానోపాధ్యాయురాలు కె. అరుణకుమారి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తయారు చేయడానికి, శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవడానికి ల్యాబ్ దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్, ఎస్టేట్ బాబు, శివరామకృష్ణ, వెంకట స్వామి పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



బాపట్ల: గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల అధ్యక్షులు వేజండ్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక వివేకానంద కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం గర్భిణులకు రోటరీ కోశాధికారి కొత్త సుబ్బారావు ఆర్థిక సాయంతో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ క్లబ్ గవర్నర్ ఆదేశాలతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ కార్యదర్శి కొత్త ఆంజనేయ వరప్రసాద్, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జిట్టా శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షులు ఉపేంద్ర గుప్త, సీనియర్ రోటరీ సభ్యులు ఈ. హరిబాబు, బూర్లె రామ సుబ్బారావు, జె.వి. కృష్ణారావు, ఎం. సుధీర్ కుమార్, కొల్లా శ్రీనివాసరావు, ఎల్.పి. కుమార్, శివరామకృష్ణ, కోళ్లపూడి బాలాజీ, టి.మల్లికార్జునరావు, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

గణపవరం(కర్లపాలెం): గణపవరం పంచాయతీ పరిధిలోని ఉర్లమ్మ ఎస్టీ కాలనీలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో నక్కా కోటయ్య ఉర్లమ్మ దంపతుల పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. బాధితులకు జనసేన నాయకులు విన్నకోట సురేష్, గరిగంటి సుధీర్‌లు పరామర్శించి కూరగాయలు, దుస్తులు, వంట పాత్రలు, నిత్యావసర సరుకులు, బియ్యంతో పాటు రూ.16వేల నగదు అందజేశారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి



బాపట్ల అర్బన్: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరం కృషి చేద్దామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలో రూ.2లక్షల విలువైన మూడు టన్నుల ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకుని జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కు తరలించనున్నట్లు ఆయన చెప్పారు. రాయల్ క్విన్ బార్ అండ్ రెస్టారెంట్‌లోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర ట్రేడర్స్‌కు చెందిన గౌడన్‌లో శనివారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిల్వలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్. కరుణ, నజీర్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మరమ్మతులకు గురైన వాటర్ ప్లాంట్



రేపల్లెలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో కిటికి వద్ద ధ్వంసమైన సన్‌షేడ్



రేపల్లెలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ధ్వంసమైన బల్లలు

సంక్షామ హాస్టళ్లలో సమస్యల తిష్ట

- పలుచోట్ల మౌలిక వసతులు కరువు
- మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానం
- తాగునీటికి కటకట
- విద్యార్థులను చేర్చడానికి తల్లిదండ్రులు నిరాసక్తత



అమర్తలూరులోని హాస్టల్‌లో అధ్వానంగా ఉన్న మరుగు దొడ్లు

రేపల్లె: నియోజకవర్గంలోని సంక్షేమ హాస్టళ్లు ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిరాదరణకు గురవుతున్నా యి. కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థుల ఇబ్బందులు వర్ణనాతీతం. పట్టణంలోని ఆరు హాస్టళ్లలోనూ మౌలిక వసతులు అంతంతమా త్రంగానే ఉన్నాయి. పట్టణంలోని ఎస్సీ బా య్స్–2, బీసీ బాలుర వసతి గృహాలు అధ్వానంగా ఉన్నాయి. ఎస్సీ బాలుర వసతి గృహంలో పలు గదుల్లో శ్లాబు పెచ్చులూడి చువ్వలు బయటపడ్డాయి. కిటికీల వద్ద సన్‌షేడ్‌లు పూర్తిగా శిథిలమవ్వడంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరు గదుల్లోకి చేరుతోంది. వసతి గృహాల్లో సగానికి పైగా మరుగు దొడ్లకు తాళాలు లేక విద్యార్థుల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఎస్సీ బాలుర వసతి గృహంలో భోజనం చేసేందుకు ఏర్పాటు చేసిన బల్లలు విరిగిపోయాయి.

గురుకుల పాఠశాలలో విద్యార్థినుల వెతలు

పట్టణంలోని 2వ వార్డులో ఉన్న అంబేడ్కర్ గురుకుల, జూనియర్ కళాశాల వసతి గృహంలో 618 మంది విద్యార్థినులు ఆశ్రయం పొందుతున్నారు. గురుకుల పాఠశాలలోని వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా పట్టించుకున్న నాథుడే లేడు. మోటర్లు కూడా చెడిపోవడంతో విద్యార్థినులు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. స్నానాలు, ఇతర అవసరాలకు కింద నుంచి మూడో అంతస్తు వరకు నీటిని మోసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. చెరుకుపల్లి మండలం కావూరు బాలికల గురుకుల పాఠశాల, నిజాంపట్నం మండలం గురుకుల పాఠశాలలో భోజనం చేసేందుకు బల్లలు లేకపోవడంతో నేలపైనే కూర్చొని చేయాల్సిన దుస్థితి నెలకొంది.

మౌలిక వసతులు కరువు

వేమూరు: ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక వసతులు కరువవ్వడంతో చేరడానికి విద్యార్థులు ముందుకు రావడం లేదు. పలు హాస్టళ్లు మూత పడుతున్నాయి. ఉన్న వాటిల్లోనూ మౌలిక సదుపాయాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం కూడా పిల్లలకు నాణ్యమైన దుస్తులు, దుప్పట్లు ఇవ్వడం లేదు. గచ్చుపై పడుకోవడానికి నానా బాధలు పడుతున్నారు.

హాస్టళ్ల మూత

నియోజక వర్గంలో గతంలో వేమూరు, కొల్లూరు, వెల్లటూరు, భట్టిప్రోలు, అమర్తలూరు చుండూరు మండలాల్లో ప్రభుత్వ హాస్టళ్లు ఉండేవి. కొల్లూరు, వెల్లటూరుల్లో హాస్టళ్లను మూసేశారు. వేమూరులో బీసీ బాలికలు హాస్టల్, భట్టిప్రోలులో బీసీ హాస్టల్, అమర్తలూరులో బీసీ హాస్టల్, చుండూరు మండలంలో అంబేడ్కర్ గురుకుల పాఠశాల కొనసాగుతోంది.

- వేమూరులో బీసీ బాలికల హాస్టల్‌లో పిల్లలు లేక పోవడంతో ఈ ఏడాది మూత వేశారు.
- భట్టిప్రోలు బీసీ హాస్టల్‌లో పిల్లలు గురించి పట్టించు కోవడం లేదు. మౌలిక సదుపాయాలు లేక నానా బాధలు పడుతున్నారు. వర్షాకాలంలో పడుకునేందుకు వసతులు లేవు.
- అమర్తలూరు బీసీ హాస్టల్ వార్డెన్ ఎప్పుడు వస్తాడో.. ఎప్పుడు వెళ్లి పోతాడో కూడా తెలియదు. పిల్లలు గురించి పట్టించుకునే నాథుడు లేడు. పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రాక పోవడంతో క్రమేణా సంఖ్య తగ్గిపోతోంది.
- చుండూరు అంబేడ్కర్ గురుకల పాఠశాల గురించి చెప్పే పరిస్థితి లేదు. హాస్టల్‌లో సమస్యల్ని బయట చెప్పరాదంటూ విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేశారు. భోజనంలో నాణ్యత లేక పోవడంతో పిల్లలు అతి కష్టంతో తింటున్నారు. మురుగుదొడ్ల పరిస్థితి కూడా అధ్వానంగా ఉంది.

అభ్యంతరకర ఫ్లెక్సీలు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

బాపట్ల: హరిహర వీరమల్లు సినిమా ప్రదర్శిస్తున్న విజయకృష్ణ థియేటర్ వద్ద అభ్యంతరకర వ్యాఖ్యలతో ఫ్లెక్సీలు కట్టిన జనసేన నాయకులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షులు చల్లా రామయ్య డిమాండ్ చేశారు. పాఠశాల ఎదురుగా ఉన్న హాలులో ఈ విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల భావితరాలకు ఏ విధమైన సంకేతాలు పంపుతున్నామో గ్రహించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్యారీ రంజిత్, యారం శేఖర్ బాబు, శీలం శివగంగ, దేవర రాఘవ పాల్గొన్నారు.

రేషన్ పంపిణీని ప్రారంభించిన తహసీల్దార్



వృద్ధురాలితో మాట్లాడుతున్న తహసీల్దార్

తెనాలిరూరల్: వృద్ధులకు ప్రతినెల ముందుగానే రేషన్ పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిబంధనల ప్రకారం శనివారం పంపిణీని పట్టణంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ప్రారంభించారు. వాస్తవానికి ప్రతినెల 1వ తేదీ నుంచి రేషన్ డీలర్ల వద్ద ఎంపిణీ జరుగుతుంది. అయితే షాపుకు వచ్చి తీసుకెళ్లలేని వృద్ధులు, వికలాంగులు, వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి నాలుగు రోజులు ముందుగానే పంపిణీకి శ్రీకారం చుట్టారు. వృద్ధులతో తహసీల్దార్ మాట్లాడి రేషన్ సరఫరాలో ఇబ్బందులు తెలుసుకున్నారు. నెలాఖరులోగా పంపిణీ పూర్తి చేస్తామని దానికి తగిన విధంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో రేషన్ షాపులకు అనుగుణంగా సిబ్బందిని కేటాయించినట్లు తహసీల్దార్ వెల్లడించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పథకాల అమలు కోసం పోరాటం

మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి



రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న రఘుపతి

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): అనుభవజ్ఞుడనని చెప్పుకునే చంద్రబాబు ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చలేదని, పథకాల అమలు కోసం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పోరాడుతున్నామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గం సమన్వయకర్త కోన రఘుపతి చెప్పారు. పిట్టలవానిపాలెం మండల పరిధిలోని గోకరాజు నల్లిబోయినవారిపాలెం, పిట్టలవానిపాలెం గ్రామాల్లో శనివారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ' రచ్చబండ కార్యక్రమాలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోన రఘుపతి మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఎన్నో మెడికల్ కాలేజీలు మంజూరయ్యాయని, ప్రస్తుతం చంద్రబాబు సీఎం కావడంతో వాటి నిర్మాణం ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. మహిళలకు ఆడబిడ్డ నిధి పథకాలు ఎప్పుడు అమలు చేస్తావ్ చంద్రబాబు ? అని కోన ప్రశ్నించారు. రైతు సమస్యలపై పోరాటం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనపై ఎన్నో ఆంక్షలు విధించి, కార్యకర్తలపై కేసులు పెట్టించటం హేయమైన చర్యగా కోన ఖండించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దబ్బకూటి మాధవరావు, బొలగాని సులోచన, సుబ్బారావు, ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, వైస్ ఎంపీపీ కృపానందం, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఏట్ర అశ్వనీరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు షేక్ మౌలాలీ, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు మండే విజయ్‌కుమార్, బడుగు ప్రకాష్, నాయకులు అన్నం యశోధరెడ్డి, ఆట్ల వెంకటరామిరెడ్డి, మురళీకృష్ణారెడ్డి, అల్లూరు సురేష్, చేబ్రోలు సురేష్, అన్నం గోపీరెడ్డి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం విఫలం



మోదుకూరులో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు.

చుండూరు(వేమూరు): సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు అనపురెడ్డి రాఘురామిరెడ్డి విమర్శించారు. చుండూరు మండలంలోని మోదుకూరులో 'బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంట్' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వైఎస్సార్ సీపీ నేతలు వెళ్లారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైన విధానాన్ని వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పూర్తిగా అమలు చేసినట్లు ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం మహిళలను, రైతులను మోసం చేసిందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నేతలు అన్నపురెడ్డి వీరారెడ్డి, అక్కిరెడ్డి, సాంబరెడ్డి, నల్లూరు మురళి, కిశోర్ , పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చినపరిమిలో...



చినపరిమిలో...

సూపర్ సిక్స్ పథకాలతో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు తమ్మా పాములరెడ్డి విమర్శించారు. చుండూరు మండలంలోని చినపరిమిలో శనివారం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. నేతలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిన తీరు గురించి వివరించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తమ్మా బసివిరెడ్డి, పామిడికొండ రాజేష్, పులివర్తి మోషే, అవుతు శ్రీనివాసరెడ్డి, మర్రిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఆళ్ల సత్యనారాయణరెడ్డి, తమ్మా పద్మావతి, గంజి ధనలక్ష్మి, దేవర కృష్ణవేణి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి హానీ



దుకాణంలో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

రేపల్లె: పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను ప్రజలు వినియోగించరాదని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు సూచించారు. మున్సిపల్ సిబ్బంది శనివారం పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించినట్లు చెప్పారు. వ్యాపారులు కూడా పాల్‌థిన్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను విక్రయించరాదని ఆయన సూచించారు. ప్రజలు కూడా ప్లాస్టిక్, పాల్‌థిన్‌ల స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని ఆయన తెలిపారు. నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందుకు బజారుకు వచ్చే సమయంలో ఇంటి నుంచి తప్పనిసరిగా గుడ్డ సంచులను తెచ్చుకోవాలని సూచించారు. ప్రతి రోజూ ప్లాస్టిక్ కవర్ల వినియోగం, విక్రయాలపై తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు. తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, శానిటరీ సెక్రటరీ సురేంద్ర, రమాదేవి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ కేసు నమోదుతో వైద్య సిబ్బంది అప్రమత్తం

ఇంటింటికీ వైద్య, ఆరోగ్య సిబ్బంది సర్వే



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న సిబ్బంది, ప్రజా ప్రతినిధులు

భట్టిప్రోలు : డెంగీ కేసు నమోదు కావడంతో భట్టిప్రోలు రైలుపేటలో శనివారం వైద్య, ఆరోగ్య సిబ్బంది సర్వే నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జ్వరాలు ఏమైనా ఉన్నాయా ? అని అడిగి తెలుసుకున్నారు. జ్వర పీడితులు గుర్తించడంతో పాటు రక్త పరీక్షలు నిర్వహించారు. వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని గ్రామస్తులకు తెలిపారు. ప్రతి శుక్ర వారం డ్రై డే పాటించాలని సూచించారు. రేపల్లె మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వై.వి. కృష్ణయ్య మాట్లాడుతూ అవసరమైతే వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీడీవో–2 ఈపూరు విజయబాబు, పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి మాష్టీ నాయక్, సీహెచ్‌వో బంకా మంగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకట పద్మావతి, హెల్త్ విజిటర్ రుసుముల్లా, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చేనేతలకు ప్రగడ కోటయ్య సేవలు ఎనలేనివి



ప్రగడ కోటయ్య విగ్రహం వద్ద చేనేత సంఘం నాయకులు

రేపల్లె: చేనేత బాంధవుడు ప్రగడ కోటయ్యకు ప్రతి చేనేత కార్మికుడు రుణపడి ఉంటారని రేపల్లె చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షులు పట్టెం శ్రీనివాసరావు కొనియాడారు. చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య జయంతి సందర్భంగా పట్టణంలోని రేపల్లె చేనేత సహకార సంఘం కార్యాలయ ఆవరణంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాడు స్వాతంత్ర పోరాటంలో, చేనేత కార్మికులకు నూలు ధరల స్థిరీకరణకు, కార్మికులు నేసిన వస్త్రాలకు గిట్టుబాటు ధరలు లభించేలా అనేక పోరాటాల్లో కోటయ్య పాల్గొన్నారని తెలిపారు. చీరాల నుంచి ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, రాజ్యసభ సభ్యునిగా చేనేత కార్మికుల కోసం చేసిన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోటయ్య విగ్రహానికి నూలు మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చేనేత సంఘాల నాయకులు కొతరపు వెంకట నాంచారరావు, న్యాయవాది జొన్నాదుల శ్రీనాగరాజు, రేపల్లె పద్మశాలి అధ్యక్షులు మునగాల నాగేశ్వరావు, అవ్వారు శ్యామసుందరావు, కున్నేర్ల సుబ్బారావు, యంగల సంజీవయ్య, అడిగోపుల చాముండి ప్రసాద్, బట్టు వెంకటేశ్వరావు, అడిగోపుల రెడ్డియ్య పాల్గొన్నారు.

మెరుగైన ప్రయాణ సదుపాయాలే లక్ష్యం

డిస్టిక్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ సామ్రాజ్యం



బస్టాండ్ ఆవరణను పరిశీలిస్తున్న సామ్రాజ్యం, ప్రక్కన డీఎం రాజశేఖర్

తెనాలిఅర్బన్: ప్రయాణీకులకు మెరుగైన వసతులు కల్పించడమే ఆర్టీసీ లక్ష్యమని డిస్టిక్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ సామ్రాజ్యం పేర్కొన్నారు. తెనాలి ఆర్టీసీ డిపోలో శనివారం ఆమె పర్యటించారు. గ్యారేజీలోని అన్ని విభాగాలను పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెనాలి డిపో పరిధిలో 81 బస్సులు ప్రయాణికులకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. వీటిలో 30వేల మంది ప్రతిరోజు వెళ్తున్నట్లు వివరించారు. ప్రయాణికులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేశామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకుఫ్రీ బస్సు ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నదనే సంకేతాలు వచ్చాయన్నారు. అందుకోసం తీసుకోవాల్సిన చర్యలన్నింటిపై చర్చిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఫ్రీ బస్సు ప్రకటించగానే మహిళలకు ఉచితంగా గమ్యస్థానాలకు చేరుస్తామన్నారు. పాత బస్సులన్నింటిని, పక్కన పెట్టామని వాటి స్థానంలో నూతన బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో డిపో మేనేజర్ రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో పతకాలు

తెనాలి: విజయవాడలో జరుగుతున్న 10వ జాతీయ ఓపెన్ తైక్వాండో పోటీల్లో పట్టణానికి చెందిన హరి హంసిక డ్యాన్స్ అండ్ లై క్వాండో ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచి పలు బహుమతులను అందుకున్నారు. ఈ పోటీల్లో హరిహంసిక విద్యార్థులు 8 బంగారు పతకాలు, 8 రజత పతకాలు, నాలుగు కాంస్య పతకాలను సాధించినట్లు ఇన్‌స్టిట్యూట్ కోచ్ ఎం.చిన్నా తెలియజేశారు. ఏపీటీఏ అధ్యక్షుడు టి.వర్ధన్‌ప్రసాద్, కార్యదర్శి చంద్రమౌళి చేతులమీదుగా ఈ బహుమతులను అందుకున్నట్లు ఆయన తెలిపారు.

సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

తెనాలి: స్వాతంత్ర్యయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి, వర్ధంతులను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం సమర్పించినట్లు శనివారం తెనాలిలో తెలియజేశారు. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన సర్దార్ గౌతు లచ్చన్న తన 17 ఏళ్ల వయసులోనే స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారని తెలిపారు. ప్రజలతో 'సర్దార్' అని పిలిపించు కున్నారని, స్వాతంత్ర్యం సిద్ధించాక అయిదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, మరోసారి ఎమ్మెల్సీగా పనిచేసిన బడుగు వర్గాల నాయకుడుగా గుర్తు చేశారు. బడుగు వర్గాలకు దేవాలయ ప్రవేశం కల్పించడం కోసం, హరిజనవాడల్లో హరినామ సంకీర్తనలు పాడిస్తూ, వారికి దేవాలయం ప్రవేశం కల్పించిన బహుజన నాయకుడు గౌతు లచ్చన్నగా పేర్కొన్నారు. ఆయన విగ్రహాన్ని రాజధానిలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తిచేశారు.

ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఫొటోగ్రఫీ పోటీలు

తెనాలి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా వేమూరు నియోజకవర్గం మోదుకూరులోని ఫొటోజెనిక్ ఆర్ట్ సర్కిల్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్థాయిలో ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆర్ట్ సర్కిల్ అధ్యక్షుడు టి.సీ తారామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కానాల సుధాకరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫొటోగ్రఫీని అంతర్జాతీయస్థాయిలో నిలిపిన డాక్టర్ ఎస్.భగవాన్‌దాస్, బండి రాజన్‌బాబు స్మారకార్థం ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. జనరల్ ఫొటోలను కలర్, మోనోక్రోమ్‌లో ఆగస్టు 9వ తేదీలోగా పంపాలని సూచించారు. ఏపీ, తెలంగాణకు చెందిన ఫొటోగ్రాఫర్లు మాత్రమే అర్హులని, ఫొటోలు సొంతంగా తీసినవై ఉండాలని, ఒక్కో అభ్యర్థి ఒక్కో విభాగంలో మూడు ఫొటోలను మాత్రమే పంపించాలని కోరారు. ప్రతి ఫొటోకు టైటిల్, అభ్యర్థి పేరు, ఫోన్ నంబరు, చిరునామా తప్పనిసరిగా ఉండాలని వివరించారు. ఆసక్తి కలిగిన ఫొటోగ్రాఫర్లు తమ ఫొటోలను ఫొటోజెనిక్ ఆర్ట్ సర్కిల్‌కు మెయిల్ చేయాలని కోరారు. వివరాలకు 98480 92182, 9491336258 నంబర్లను సంప్రదించవచ్చని తెలియజేశారు.